క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



సన్నవిల్లిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ మధుసూదన్

ఉప్పలగుప్తం: ఉపాధి పనులతో కూలీలకు పని దినాలు కల్పించి, రైతులకు వ్యవసాయంలో సహకారం అందించాలని డ్వామా పీడీ ఎస్. మధుసూదన్ అన్నారు. మండలంలోని సన్నవిల్లి పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. రైతు పొలంలో కొబ్బరి చెట్లకు పళ్లాలు తవ్వుతున్న కూలీలకు పలు సూచనలిచ్చారు. సర్పంచ్ చిక్కం జంగమయ్య, ఏపీవో వి.రాజామణి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉప్పంగలలో నేడు గడప గడపకూ..

తాళ్లరేవు: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం గురువారం ఉప్పంగల సచివాలయ పరిధిలో నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.అనుపమ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ప్రజా పరిషత్ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరుకానున్నారని, అన్ని శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు. అదేవిధంగా ఉప్పంగల సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అన్ని ప్రభుత్వ పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాలతో పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆదేశించారు.

అర్హులకు ఉచితంగా సదరమ్ సర్టిఫికెట్లు

ముమ్మిడివరం: అర్హులందరికీ సదరమ్ సర్టిఫికెట్లు ఉచితంగా అందించనున్నట్టు అమలాపురం ఏరియా ఆసుపత్రి ఎముకల వైద్యుడు రామకృష్ణ తెలిపారు. ముమ్మిడివరం కమ్యూనిటీ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ దయానా ఆధ్వర్యంలో నిర్వహించిన సదరమ్ శిబిరంలో ఆయన పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వికలాంగులు సదరమ్ సర్టిఫికెట్ పొందటానికి ముందుగా మీసేవ, సచివాలయాలలో స్లాట్ నమోదు చేసుకోవాలని వారికి కేటాయించిన తేదీలలో శిబిరాలకు వచ్చి వైద్యులతో పరీక్షలు చేయించుకుని సర్టిఫికెట్లు పొందాలని తెలిపారు. ఈ శిబిరానికి హాజరైన 18 మందికి పరీక్షలు నిర్వహించారు.

కాదా కుటుంబానికి పరామర్శ

తాళ్లరేవు: మాతృ వియోగంతో బాధపడుతున్న ఉప్పంగల ఎంపీటీసీ సభ్యుడు కాదా శ్రీనివాస్ కుటుంబాన్ని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ బుధవారం పరామర్శించారు. ఉప్పంగల మాజీ ఎంపీటీసీ సభ్యురాలు, ప్రస్తుత ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్ తల్లి కాదా ఆదిలక్ష్మి ఇటీవల మృతి చెందారు. అలాగే ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్ కూడా శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మాజీ కౌన్సిలర్ సత్యనారాయణమ్మ మృతి

అమలాపురం టౌన్: మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మేడిది సత్యనారాయణమ్మ (65) అనారోగ్యంతో మంగళవారం రాత్రి స్వగృహంలో మృతి చెందారు. ఆమె 2000–05 మున్సిపల్ కౌన్సిల్‌లో 7వ వార్డు కౌన్సిలర్‌గా పనిచేశారు. ఆమెకు ఐదుగురు కుమారులు ఉన్నారు. అప్పట్లో కౌన్సిలర్‌గా ఆ వార్డు అభివృద్ధికి పాటు పడ్డారు.

కౌలు రైతుల ధర్నా

అమలాపురం టౌన్: స్థానిక కలెక్టరేట్ ఎదుట కౌలు రైతులు తమ సమస్యల పరిష్కారానికి బుధవారం ధర్నా చేశారు. ఖరీఫ్ ధాన్యాన్ని పది రోజులుగా ఆరబోసుకుంటున్నా ఆర్బీకేలు సంచులు ఇవ్వడం లేదని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని రైతులు డీఆర్వో సీహెచ్ సత్తిబాబుకు అందించారు. ధర్నాలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి

అల్లవరం: సంక్రాంతి పండుగ నేపథ్యంలో తదేకం ఫొండేషన్ ఆధ్వర్యంలో బోడసకుర్రు పంచాయతీ పరిధిలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలైన మహిళలకు సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, ఫొండేషన్ కోఆర్డినేటర్ సుధా మాధవి బుధవారం బహుమతులు అందించారు. సర్పంచ్ అధ్యక్షతన బోడసకుర్రులో జరిగిన కార్యక్రమంలో ముగ్గురు విజేతలకు బహుమతులు అందజేశారు. జనసేన నాయకులు శెట్టిబత్తుల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై పుడమి పుత్రుని చూపు

- సహజ ఎరువులతో నాణ్యమైన ఉత్పత్తులు
- జిల్లాలో సుమారు 8 వేల ఎకరాల్లో అమలు
- వ్యయం తగ్గుతుందంటున్న అధికారులు
- రసాయన ఎరువులతో తగ్గుతున్న భూసారం
- ఈ విధానాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం



కొబ్బరి తోటల్లో వేసిన అంతర పంటలు

ముమ్మిడివరం: వ్యవసాయ ఆధారిత కోనసీమ జిల్లాలో సేంద్రియ సేద్యంపై రైతులు మొగ్గు చూపుతున్నారు. భూసారం పెంపొందించే ప్రకృతి విధానాలపై, సహజ ఎరువులు వాడేందుకు ముందుకు వస్తున్నారు. రసాయనాల ఎరువులకు బదులు వేప కషాయం, జీవామృతం వినియోగించి నాణ్యమైన పంటను సాగుచేసి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. కొబ్బరి ఆధారిత ప్రాంతం కావడంతో అధికంగా అంతర పంటలుగా వరి, కూరగాయలు పండిస్తున్నారు. ముమ్మిడివరం సబ్ డివిజన్ పరిధిలో వంగ, మెంతులు, జొన్నలు, మినుములు, పెసర, పిల్లి పెసర, జనుము, గోంగూర, తోటకూర, కందులు, మిరప, టమాటా వంటి పంటలు ఎక్కువగా పండిస్తున్నారు. జిల్లాలో సుమారు 8 వేల ఎకరాల్లో ప్రకృతి సాగు చేస్తున్నారు. టీటీడీకి ఎగుమతి చేసేందుకు ఎన్ఆర్ఎన్ 15048 సన్నాలు రకం వరి సాగుకు మండలానికి రెండు గ్రామాలను ఎంపిక చేసి వరి సాగు చేస్తున్నారు. గతంలో రసాయన మందులు వాడి భూసారం కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో చాలా మంది రైతులు నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. దీనిపై దృష్టి సారించిన వ్యవసాయ శాఖ, జిల్లా ప్రకృతి సేద్యం అధికారులు సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించుకోవాలని ప్రచారం చేశారు. దీంతో రైతులు సేంద్రియ విధానాలపై ఆసక్తిని పెంచుకున్నారు.



కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



ప్రకృతి వ్యవసాయానికి కావలసిన విత్తనాలు

ప్రకృతి పద్ధతిలోనే...



మూడేళ్లుగా ప్రకృతి పద్ధతిలోనే సాగుచేస్తున్నాను. ఇది వరకటి పెట్టుబడి తక్కువే అవుతుంది. మంచి దిగుబడి కూడా వస్తోంది. సేంద్రియ విధానంలో పండించిన వరి బియ్యాన్ని మా బంధువులకు మిత్రులకు కూడా పంపుతున్నాం. మార్కెట్‌లో దొరికే సూపర్ ఫైన్ కంటే ఈ ధాన్యం శ్రేష్ఠం.

– రామలింగేశ్వరరావు, రైతు, టి.కొత్తపల్లి

ఆరోగ్యకరమైన ఆహారమే లక్ష్యం



ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కలిగిస్తున్నాం. భూసారం తగ్గించే రసాయనిక ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచుతున్నాం. జీవామృతం, ప్రకృతి వ్యవసాయంపై వారికి శిక్షణ ఇస్తున్నాం. ప్రతి గ్రామంలో ఇద్దరు రైతులను ఎంపిక చేసి ప్రకృతి వ్యసాయం చేయిస్తున్నాం. తిరుమల, తిరుపతి దేవస్థానం వినియోగించే ఆర్ఎన్ఆర్ 15048 రకం వరిని సాగుచేస్తున్నాం.

– సంగాడి హేమలత, ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్, ముమ్మిడివరం

లయన్స్ వశిష్ట క్లబ్ వితరణ



కుర్చీలు, కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న మంగతాయారు, అమలాపురం క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: లయన్స్ వశిష్ట డిస్ట్రిక్ట్ గవర్నర్ మాటూరి మంగతాయారు అధికారిక పర్యటన సందర్భంగా అమలాపురం లయన్స్ వశిష్ట క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పలు వితరణలు చేపట్టింది. క్లబ్ అధ్యక్షురాలు త్సవటపల్లి మధుశ్రీ ఆధ్వర్యంలో మంగతాయారు స్థానిక లేత్ అండ్ ఆర్క్ వెల్డింగ్ అసోసియేషన్‌కు 50 కుర్చీలు, ఇద్దరి మహిళలకు స్వయం ఉపాధి నిమిత్తం రెండు కుట్టు మెషీన్లు, పది మంది పేదలకు డ్రై రేషన్ కిట్లు అందజేశారు. అలాగే పి.గన్నవరం మండలం ముంజవరం పంచాయితీకి వాటర్ డిస్పెన్సర్, అల్లవరం మండలం గోపాయిలంక గ్రామంలో రెండు సిమెంట్ బల్లలు సమకూర్చి మొక్కలు నాటారు. ఇద్దరి విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, వీధి వ్యాపారులకు గొడుగులు, పట్టణంలోని వడ్డిగూడెం ఎస్సీ హాస్టల్‌కు గ్రైండర్ అందించారు. ఈ కార్యక్రమాల్లో క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ మాకిరెడ్డి పూర్ణిమ, మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ శేఠ్ అనిల్‌కుమార్ జైన్, లయన్స్ మాజీ గవర్నర్ డాక్టర్ పీఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్
- సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ఐ.పోలవరం: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండలంలో కొమరిగిరిలో 15 ఆర్థిక సంఘం నిధులు రూ.14 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చి పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వరసాల విజయ చాముండేశ్వరి, ఎంపీపీ మోర్త రాణి మిరియాం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, ఎంపీటీసీ సఖిలే పద్మావతి, పిన్నమరాజు వెంకట పతిరాజు, కలిదిండి సీతారామరాజు, ఏలూరి ఆదినారాయణ, పెన్మత్స వాసురాజు, దూళిపూడి చక్రం తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర కిట్ల పంపిణీ

ముమ్మిడివరం: మండలం చినకొత్తలంకలో క్షత్రియ ఫొండేషన్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర వస్తువులు, కోడిగుడ్లు అందజేశారు. కనుమూరి వెంకట కృష్ణంరాజు జ్ఞాపకార్థం అతని కుమారుడు దీపక్ వర్మ 15 పేద కుటుంబాలకు వీటిని పంపిణీ చేశారు.

ఘనంగా వేమన జయంతి

ముమ్మిడివరం: ప్రజా కవి యోగి వేమన జయంతిని స్థానిక కళాసాహితీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు నివాళులు అర్పించారు. యోగి వేమన జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండగగా గుర్తించడం పై వారు హర్షం వ్యక్తం చేశారు. ఎం.ఆశీర్వాదం, కర్నీడి వెంకటేశ్వరరావు, పి.శివనాగరాజు, విత్తనాల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే లైన్ నిర్మాణ పనులు చేపట్టాలి



రైల్వే లైన్ నిర్మాణంపై మంత్రి విశ్వరూప్‌తో చర్చిస్తున్న కోనసీమ జేఏసీ ప్రతినిధుల బృందం

అమలాపురం టౌన్: కోటిపల్లి–నర్సాపురం రైల్వే లైన్ నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధుల విడుదలకు కృషి చేయాలని మంత్రి పినిపే విశ్వరూప్‌ను కోనసీమ జేఏసీ బృందం అభ్యర్థించింది. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంత్రి విశ్వరూప్‌ను జేఏసీ కన్వీనర్ బండారు రామమోహనరావు ఆధ్వర్యంలో బుధవారం కలసి రాష్ట్ర ప్రభుత్వ వాటాకు బదులుగా రైల్వే ట్రాక్ నిర్మాణానికి అవసరమైన భూమిని ఉచితంగా ఇచ్చే అంశాన్ని మంత్రికి వివరించారు. ఈ విషయమై సాధ్యాసాధ్యాలను సీఎంతో చర్చిస్తానని మంత్రి వారికి తెలిపారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ నుంచి ఓ స్పష్టమైన ప్రకటన వచ్చే వరకూ వేచి ఉండాలని సూచించారు. జేఏసీ ప్రతినిధులు డాక్టర్ మధుర నరసింహమూర్తి, డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, కరాటం ప్రవీణ్ తదితరులు మంత్రి విశ్వరూప్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

అంతర్ వర్సిటీ బాల్ బ్యాడ్మింటన్‌లో విద్యార్థుల ప్రతిభ



బాడ్మింటన్‌లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు

యానాం: ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని మంగుళూరు జిల్లాలో నిర్వహించిన అఖిల భారత అంతర్ వర్సిటీ బాల్ బ్యాండ్మింటన్ చాంపియన్‌షిప్‌లో యానాం క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. అన్నా వర్సిటీ జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. ఈ జట్టులో స్థానిక క్లబ్ క్రీడాకారులు కర్రి నూకేష్ వర్మ, చింతా వాసు సెయింట్ జోసెఫ్ కళాశాలలో చదువుతూ అన్నా వర్సిటీ జట్టుకు ప్రాతినిధ్యం వహించినట్లు క్లబ్ కార్యదర్శి కాపగంటి అనురాగ ఆదర్శ శేష సుమన్ తెలిపారు. యూనివర్సిటీ స్థాయిలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను శేష సుమన్, కోచ్ బొట్ట శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారులు రాయపురెడ్డి విజయ్, కనపర్తి వీరబాబు, రెడ్డి లోవ నరేష్, సోమేశ్వరపు శ్రీను, అజయ్, ఎడ్ల శాంతి, ఈశ్వరి తదితరులు అభినందించారు.

విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నాటి గురువులతో అల్లవరం పాఠశాల విద్యార్థులు



కాట్రేనికోన హైస్కూల్‌లో కలసిన నాటి విద్యార్థులు

అల్లవరం: స్థానిక ఉన్న పాఠశాల 1997–98 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు బుధవారం ఆత్మీయంగా కలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, స్థానిక వైద్యుడు బసవ వరహాలు ముఖ్య అతిథిగా హాజరై నేటి తరం పిల్లల నడవడిపై దృష్టి సారించాలన్నారు. అనంతరం నాటి సంగతులు, అల్లర్లు, ప్రస్తుతం ఏం చేస్తున్నదీ ఒకరికి ఒకరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటపతిరాజు మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనం ద్వారా పూర్వ విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులను కలుసుకోవడం ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం గురువులను శాలువాలతో సత్కరించి, షీల్డ్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కాట్రేనికోనలో..

కాట్రేనికోన: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1994–95 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు బుధవారం తాము చదువుకున్న పాఠశాలలో కలిసారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని కలుసుకున్న వారంతా పాఠశాల ఆవరణలో తిరుగుతూ గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ నాటి జ్ఞాపకాలను, మధురానుభూతులను గుర్తు చేసుకున్నారు. నాటి గురువులు రాజు, వెంకటరెడ్డి, ముసలయ్య, శ్రీరాములు, ఆనందరావు, శేషవేణి, రామకృష్ణలను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, సుధాకర్, వెంకట రమణ, వీరబాబు, ధర్మారావు, సహదేవుడు, సాగర్‌శంకర్, రత్నకుమారి, రాంబాబు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



అమలాపురంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనందరావు, నాయకులు

అమలాపురం టౌన్: దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతిని నియోజకవర్గ టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఎన్టీఆర్ విగ్రహానికి వారు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అలాగే జిల్లా చేతి వృత్తుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక సంఘ కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఎన్టీ రామారావుకు నివాళులు అర్పించారు. అలాగే స్థానిక ట్యాక్సీ స్టాండ్ వద్ద పట్టణ టీడీపీ కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ భాస్కర్ల రామకృష్ణ ఆధ్వర్యంలో 300 మందికి అన్నదానం చేశారు.

అమలాపురంలో..

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంకలో గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. చింతా శంకరమూర్తి, ఊటుకూరి వీరబ్రహ్మం చారిటబుల్ ట్రస్ట్, టీడీపీ కార్యకర్తలు 350 దుప్పట్లు, 100 చీరలు, పేదలకు పంపిణీ చేశారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

తాళ్లరేవు: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సంతపేట సెంటర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, దివ్యాంగులు, వృద్ధులు 200 మందికి దుప్పట్లు, భోజన ప్యాకెట్లు పంపిణీ చేసారు. నాయకులు మందాల గంగ సూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరంలో..

అల్లవరం: టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో కోడూరుపాడులోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు.

ముమ్మిడివరంలో..

ముమ్మిడివరం: స్థానిక పోలమ్మ చెరువు వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, గొలకోటి దొరబాబు తదితరులు నివాళులు అర్పించారు.

ఉప్పలగుప్తంలో..

ఉప్పలగుప్తం: మండల పరిధి గొల్లవిల్లిలో మండల టీడీపీ అధ్యక్షుడు అరిగెల నానాజీ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ బుచ్చి మహేశ్వరరావు తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు.

ఊపందుకున్న తీర్థం పనులు



పశ్చిమ రాజగోపురానికి చేస్తున్న విద్యుదీకరణ పనులు

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రంలో లక్ష్మీనృసింహుని తీర్థం పనులు ఊపందుకున్నాయి. భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాల అనంతరం ఆయా శాఖల ఆధ్వర్యంలో పనులు వేగవంతమయ్యాయి. ప్రధానంగా ఆలయం లోపల, వెలుపల భక్తుల క్యూలకు సంబంధించిన బారికేడ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. స్వామివారి కల్యాణం వేదిక ఎదురుగా ఐరన్‌మెష్ పందిరిపై కొత్తగా తాటాకు వేసే పనులు పూర్తి చేశారు. స్వామి రథం చక్రాలకు కీలు పెట్టే పనులు పూర్తి చేశారు. ఆలయానికున్న నాలుగు దిక్కుల్లోని ప్రధాన రాజగోపురాలకు విద్యుదీకరణ పనులు చేస్తున్నారు. సంక్రాంతి పర్వదినాలు ముగిసిన కూడా ఆ రద్దీ కొనసాగుతోంది. భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లి స్వామిని దర్శించుకున్నారు. అలాగే అన్నదాన పథకంలో స్వామి ప్రసాదాన్ని భక్తులు తీసుకున్నారు. బూరెలు, పులిహోరతో కలిపి వడ్డిస్తున్న రుచికరమైన భోజనాలపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

నైపుణ్య శిక్షణతో ఉపాధి కల్పన

కొత్తపేట: రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్స్ ద్వారా నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నట్టు సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఏపీ (సిడాప్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.పార్థసారథి తెలిపారు. ముమ్మిడివరం ఎయిమ్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవప్‌మెంట్ సెంటర్‌ను సందర్శించిన ఈడీ మార్గం మధ్యలోని వాడపాలెంలో సంతోషిమాత అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన సాక్షితో మాట్లాడుతూ రాష్ట్రంలో చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగావకాశం కల్పించాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల నుంచి పుట్టిన మానసపుత్రిక ఈ నైపుణ్య శిక్షణ కళాశాలలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 92 స్కిల్ ట్రైనింగ్ సెంటర్స్ ఏర్పాటు చేయగా 52 కోర్సుల్లో సుమారు 50 వేల మంది యువతకు ఉచిత భోజనం, వసతి సదుపాయాలతో శిక్షణ ఇచ్చి, వారిలో సుమారు 28,220 మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్టు తెలిపారు. ముందుగా సంతోషిమాత ఆలయంలో అర్చకుడు పెద్దింటి రామం ఈడీ పార్థసారథి పేరున పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేసి, అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. అనంతరం రామం స్వగృహాన్ని సందర్శించి, రామం తనయుడు వంశీ రూపొందించిన వినూత్న ప్రయోగాలను తిలకించారు. వాటి ద్వారా సాధించిన రికార్డులను పరిశీలించి అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ.55,074 విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి మండలంలోని వీరవల్లిపాలేనికి చెందిన జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు అడపా వెంకటరమణ కుటుంబ సభ్యులు బుధవారం రూ.55,074 విరాళం అందజేశారు. ఈ సొమ్మును దాత ఆలయ పాలక వర్గ సభ్యులకు అందజేశారు. దాతను వేదపండితులు సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

టీబీ రోగులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలి

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- సీఎం జగన్ ఫాలోవర్స్‌చే పౌష్టికాహార కిట్ల పంపిణీ



టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం టౌన్: టీబీ రోగులు క్రమం తప్పకుండా మందులు వాడుతూ పౌష్టికాహారాన్ని తీసుకుంటే ఈ వ్యాధి నుంచి పూర్తి రక్షణ పొందవచ్చని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. సీఎం జగన్ ఫాలోవర్స్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లో టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లను కలెక్టర్ శుక్లా బుధవారం పంపిణీ చేసి ప్రసంగించారు. 'ముక్త భారత్–నిక్షయ్ మిత్ర' సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో పౌష్టికాహారాన్ని సీఎం జగన్ ఫాలోవర్స్ నాయకులు వంటిద్దు వెంకన్నాయుడు, జల్లి సుజాత, నెల్లి సావిత్రి మేఘన సమకూర్చారు. సంస్థ తరఫున పట్టణంలో 15 మంది టీబీ రోగులను దత్తత తీసుకుని వారికి పౌష్టికాహారం అందించే బాధ్యతను స్వీకరించినట్టు వెంకన్నాయుడు తెలిపారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.దుర్గారావు దొర, జిల్లా ఎయిడ్స్ లెప్రసీ, టీబీ నియంత్రణ అధికారిణి డాక్టర్ భారతలక్ష్మి, జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ టీకే శ్రీనివాసరావు, స్టేట్ టీబీ సపోర్టింగ్ ఎన్జీవో డాక్టర్ దుర్గారావు, స్టేట్ టీబీ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ పీఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో ఓఎన్జీసీని భాగస్వామ్యం చేస్తాం



కె.పెదపూడిలో ఆర్డీవో ముక్కంటికి సమస్యలు వివరిస్తున్న మహిళలు

అంబాజీపేట: మౌలిక వసతుల కల్పనతో పాటు గ్రామాభివృద్ధిలో ఓఎన్జీసీని భాగస్వామ్యం చేసేందుకు చర్యలు తీసుకుంటామని కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి అన్నారు. కె.పెదపూడిలో ఓఎన్జీసీ రిగ్గు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ పంచాయతీ తీర్మానం జిల్లా కలెక్టర్‌కు అందజేయడంతో ఆర్డీఓ బుధవారం ఓఎన్జీసీ స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా బీరవారిపేట, నేదునూరివారిపేట కాలనీలకు చెందిన మహిళలు మాట్లాడుతూ తమ నివాస ప్రాంతాల్లో డ్రైనేజీలు, రోడ్లు, వ్యక్తిగత మరుగుదొడ్లు, కమ్యూనిటీ భవనం, పక్కా ఇళ్లు ఓఎన్జీసీ ద్వారా నిర్మించి ఇవ్వాలని ఆర్డీవోకు వివరించారు. ఓఎన్జీసీ రిగ్గు పనులు ప్రారంభించే ముందే స్పష్టమైన హామీని తమ కాలనీవాసులకు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్తులు తెలిపిన అభివృద్ధి పనులపై త్వరలో గ్రామ సభ ఏర్పాటు చేసి తీర్మాన కాపీని జిల్లా కలెక్టర్‌కు పంపించే ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ ఐ.రత్నంరాజు, ఈఓపీఆర్డీ బి.మమత, పంచాయతీ కార్యదర్శి రాయి ఏడుకొండలు చంటిలకు సూచించారు. కాలనీ వాసులు చెప్పిన అంశాలన్నింటిని ఉన్నతాధికారులకు తెలియపరిచి తగు న్యాయం చేస్తామని చెప్పారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ ఎల్.జోసఫ్, ఓఎన్జీసీ జీఎం జాన్ వెస్లీ, వీఆర్వోలు ఉన్నారు.